# పల్స్ జనగణనలో చురుగ్గా పాల్గొనాలి



మాట్లాడుతున్న కేసన శంకరరావు

**మల్లికార్జునపేట, న్యూస్‌టుడే:** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనున్న పల్స్ సర్వేలో బీసీలు చురుగ్గా పాల్గొనాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు అన్నారు. బ్రాడీపేటలోని రాష్ట్ర కార్యాలయంలో గురువారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో 54, రాష్ట్రంలో 52 శాతంగా బీసీలున్నారని కమిషన్లు చెబుతున్నా.. ప్రభుత్వాలు ఆ ప్రాతిపదికన రిజర్వేషన్లు, సంక్షేమ పథకాలు కేటాయించడం లేదన్నారు. న్యాయస్థానాల్లో చర్చకు వస్తే ప్రభుత్వం బీసీల శాతాన్ని కచ్చితంగా చెప్పటం లేదని పేర్కొన్నారు. దీంతో బీసీలు అనేక రకాలుగా నష్టపోతున్నారని చెప్పారు. పదేళ్లకో సారి నిర్వహించాల్సిన జాతీయ జనగణన, కులాల వారీగా చేపట్టాలని బీసీ సంఘాలు, కుల సంఘాలు డిమాండ్ చేస్తున్నాయని, కానీ ప్రభుత్వాలు ఈ అంశాన్ని ప్రభుత్వాలు పట్టించుకోవటం లేదన్నారు. 2011 జనగణనలో బీసీల సంఖ్యని సేకరించినా బహిర్గతం చేయలేదని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనున్న పల్స్ జనగణనలో అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఈ దిశగా సర్వేను నిర్వహించటం సంతోషంగా ఉందన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు ఈడే మురళీకృష్ణ, నగర అధ్యక్షుడు కన్నమాస్టారు, బీసీ నాయకులు కె.సాంబశహవరావు తదితరులు పాల్గొన్నారు.

# న్యూగుంటూరు మీదుగా రెండంతస్తుల రైలు?

**గుంటూరు రైల్వే, న్యూస్‌టుడే:** విశాఖపట్నం-విజయవాడ-గూడూరు- తిరుపతి మధ్య వచ్చే నెల ఒకటి నుంచి నడపాలని ప్రతిపాదించిన రెండంతస్తుల రైలు (డబుల్ డెక్కర్)ను న్యూగుంటూరు మీదుగా మళ్లించేందుకు గల అవకాశాలను అధికారులు గురువారం ఉదయం పరిశీలించారు. ఈ రైలు విజయవాడ నుంచి కేసీ కెనాల్, మంగళగిరి, న్యూగుంటూరు వచ్చి తెనాలి వెళ్లనుంది. ఈ స్టేషన్ల మీదుగా రాకపోకలు కొనసాగించేందుకు ప్లాట్‌ఫాంలు అనువుగా ఉన్నాయో లేదో తనిఖీ చేసేందుకు ప్రయోగాత్మకంగా పరిశీలన చేశారు. ఈ మార్గం అనువుగానే ఉన్నట్లు తెలిసింది. ద.మ.రైల్వే ఉన్నతాధికారుల నిర్ణయం మేరకు ఎటువైపు నుంచి నడపాలో త్వరలోనే తేలనుంది. అదేవిధంగా గూడూరు వరకే నడపాలా లేదా తిరుపతి వరకు పొడిగించవచ్చా అనే విషయంపై కూడా స్పష్టత రానుంది. ప్రస్తుతం ఈ రైలు కాచిగూడ-గుంటూరు మధ్య వారానికి రెండు రోజులు నడుస్తుంది.

## రూ.10లక్షల దోపిడీ ఘటనపై

# దర్యాప్తు ముమ్మరం

**దుగ్గిరాల, న్యూస్‌టుడే:** దుగ్గిరాల పసుపు వ్యాపారి గమస్తా నుంచి రూ. 10 లక్షల దోపిడీ జరిగిన కేసులో పోలీసుల విచారణ ముమ్మరంగా కొనసాగుతోంది. బుధవారం సాయంత్రం 4.40 గంటల సమయంలో రేవేంద్రపాడు-తుమ్మపూడి మధ్య విజయవాడ నుంచి ద్విచక్ర వాహనంపై నగదు తెస్తున్న గుమస్తా అలపర్తి కృష్ణారావు వద్ద పోలీసునని చెప్పి ఒక వ్యక్తి రూ. 10 లక్షలు తీసుకుని దోపిడీ చేసిన విషయం విధితమే. దీనిపై పోలీసులు విస్తృతంగా విచారణ చేస్తున్నారు. కృష్ణారావు నగదు తీసుకుని ఎటు వచ్చారో ఆ మార్గంలో ఉన్న సీసీ కెమేరాల దృశ్యాల్ని పోలీసులు పరిశీలించారు. దీనికి తోడు తాడేపల్లి, మంగళగిరి, విజయవాడలలో ఉన్న నేరస్థుల చిత్రాల్ని కృష్ణారావుకు చూపారు. ఆ ఫోటోల్లోని వ్యక్తులు ఎవరూ కాదని తెలిసింది. పోలీసులు విజయవాడలో నగదు తెచ్చిన పంజాబ్ నేషనల్ బ్యాంక్‌కు కూడా వెళ్లి విచారించారు. అక్కడ కెమేరాల్లోని దృశ్యాలనూ గమనించారు. అయితే ఆ మార్గాల్లో గుమస్తా చెప్పిన నిందితుడి ఆనవాళ్లు లభించలేదని అంటున్నారు. దీంతో పోలీసులు అన్ని కోణాల్లోనూ విచారిస్తున్నారు. దాదాపు పదేళ్ల క్రితం ఒక వ్యాపారి గుమస్తా పెనుమూలికి చెందిన గూడపాటి రాంబాబు ఇలానే నగదు తెస్తూ కన్పించకుండా పోయారు. అప్పటి నుంచి ఇప్పటి వరకూ అతని ఆచూకీ లేదు.

**పెట్రోలింగ్ అవసరం:** తెనాలి-మంగళగిరి మార్గంలో పోలీస్ పెట్రోలింగ్ అవసరమని పలువురు పేర్కొంటున్నారు. రేవేంద్రపాడు-తుమ్మపూడి మధ్య విజయవాడ నుంచి ద్విచక్రవాహనంపై వెళుతున్న భార్యాభర్తలను వెంబడించారు. అప్పుడు మహిళ మెడలోని గొలుసును లాక్కునే ప్రయత్నం చేయడం ఈ సంఘటనలో భార్యాభర్తలతో పాటు, నేరస్థులు కూడా బండి మీద నుంచి పడడంతో దొంగలు దొరికిపోయారు. రాజధాని మార్గంగా కూడా అభివృద్ధి చెందుతుండడంతో ప్రత్యేక పెట్రోలింగ్ అవసరమని పలువురు చెపుతున్నారు.